ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

7

మంగళవారం 14 జనవరి 2025



వైసీపీని వీడనున్న మాజీ ఎమ్మెల్యే రాజశేఖర్



- మరోసారి పరాభవంతో కుమిలిపోతున్న మర్రి
- ఇన్‌చార్జ్ బాధ్యతలతో పాటు అతని భార్యకు సీటిస్తానని మాట ఇచ్చి తప్పిన జగన్
- గుంటూరులో ఓడిన రజనీకి తిరిగి చిలకలూరిపేట పగ్గాలు
- అప్పటి నుంచి రగిలిపోతున్న రాజశేఖర్

8

సరదాల సంక్రాంతి!



నరసరావుపేటలోని ప్రకాష్‌నగర్‌లో భోగిమంట

భానుడి ఉత్తరాయాణంతో వెలుగులు పండే సుదినం

పంట చేతికొచ్చిన వేళ రైతులు చేసుకునే సంబరాలు

జిల్లా వ్యాప్తంగా ఘనంగా భోగి వేడుకలు

గుంటూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రులకు అత్యంత ప్రీతిపాత్రమైన పండుగ మకర సంక్రాంతి. తెలుగునాట ప్రతి ఇంటా ఆ సంక్రాంతి తెచ్చే సంతోషం అంతా ఇంతా కాదు. దేశంలో ఎక్కడున్నా.. ఆ సుదినాన అందరూ సొంత గ్రామాలకు ప్రయాణం కట్టేస్తారు. అవకాశం ఉండాలే కాని విదేశాల్లో ఉన్నవారు సైతం సొంత ఊరి బాట పడతారు. ముచ్చటగా మూడు రోజులు, అదృష్టం కలిసి వస్తే నాలుగు రోజులు కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి సంబరాలు చేసుకుని సంతోషాలను ప్రోది చేసుకుంటారు. ఆ మధురానుభూతులతో తిరుగు ప్రయాణం కడతారు.

ధనుర్మాసంలో సూర్య భగవానుడు దక్షిణాయాణం ఉచ్చదశను చేరుతాడు. భోగి పండుగ రోజున దక్షిణాయాణాన్ని పూర్తి చేసుకుని ఉత్తరాయణాన్ని ప్రారంభిస్తాడు. ఆ సమయంలో ప్రతి ఒక్కరూ తమ సామర్థ్యం మేరకు దానధర్మాలు చేస్తే మంచిదని ప్రతీతి. అలా చేయడం వల్ల శుభ ఫలితాలొస్తాయని జనం నమ్ముతుంటారు. కొత్తగా పెళ్లి చేసుకున్న వారు బొమ్మల నోము, సావిత్రి గౌరీ వ్రతం చేస్తారు. మరికొందరు మకర సంక్రాంతి రోజున తమ పూర్వీకుల ఆత్మ శాంతి కోసం తమ సామర్థ్యం మేరకు దానధర్మాలు చేస్తారు.

పురాణాల ప్రకారం 'సంక్రాంతి'

పురాణాల ప్రకారం.. మకర సంక్రాంతి రోజునే భగిరథుడు తన తపస్సుతో ఆకాశంలో ఉండే గంగమ్మను భువిపైకి తీసుకొస్తాడు. తమ పూర్వీకులకు తర్పణం సమర్పించేందుకు భగిరథ మహర్షి గంగమ్మను భువిపైకి ఆహ్వానిస్తాడు. తన ప్రతిపాదనను అంగీకరించి మకర సంక్రాంతి పండుగ రోజున గంగాదేవి భువిపైకి వస్తుంది. గంగాదేవి భూమి పైకి వచ్చిన సుదినమైన రోజు కావడంతో ఆ రోజున మకర సంక్రాంతి పండుగ చేసుకుంటారు. కాబట్టి ఆ పవిత్రమైన రోజున గంగానదిలో లేదా ప్రవహించే నీటిలో స్నానం చేస్తే పుణ్యఫలాలు పొందుతారని పురాణాలు చెబుతున్నాయి. సంక్రాంతి నెలలో హరిదాసుల సందడి చాలా ప్రత్యేకమైనది. హరినామ సంకీర్తనలు పాడుతూ ప్రజలను అలరిస్తూ ఇంటింటికీ తిరిగి మాలదాసరులు సందడి చేస్తారు. పంట చేతికందిన సంతోషంతో రైతులు వారికి తగిన రీతిలో ధాన్యం ఇచ్చి గౌరవించేవారు. సామాన్యులు తమకు తోచిన మొత్తం ఇచ్చేవారు.



మూడో రోజు ముక్క పండగ 'కనుమ'!

మకర సంక్రాంతి పండుగ ముగిసిన మరుసటి రోజున కనుమ పండుగ. ఈరోజున తమ పశువులను అందంగా అలంకరించి, వాటికి ఇష్టమైన దాణా పెడతారు. కనుమ నాడు మాంసాహారం తీసుకుంటారు. కనుమకు ముక్కనుమ కూడా తోడైతే ఆ సంతోషాలకు హద్దులే ఉండవు. అలా నాలుగైదు రోజులపాటు సంక్రాంతి పండుగ సందడి చేస్తుంది. ఏడాదికి సరిపడా సంతోషాన్ని పంచుతుంది. తనివి తీరా ఆస్వాదించి పండగను ముగించుకుని అందరూ మళ్లీ పట్నం బాట పడతారు. సంవత్సరానికి సరిపడేంత సంతోషాన్ని తీసుకెళ్తారు. అందుకే సంక్రాంతిని సరదాల సంక్రాంతిగా చెప్పుకుంటుంటారు.

పల్నాడులో.. పందేల జోరు



రొంపిచర్ల మండలం కొనకంచివారి పాలెం వద్ద నిర్వహిస్తున్న కోడి పందేలు

కొనకంచివారి పాలెం వద్ద కోడి పందేలు

ఎడ్వర్డ్‌పేట.. దొండపాడులలో కూడా..

భారీగా చేతులు మారుతున్న నగదు

తీర ప్రాంతంలో భారీ ఏర్పాట్లు

వీఐపీలకు నాటుకోడి, మటన్ బిర్యానీలు

పందేలను వీక్షించిన మంత్రి అనగాని, జనసేన నాయకులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పందెంకోళ్ళ పౌరుషంతో కత్తులు దూస్తే పేకముక్క జూదప్రియుల చేతుల్లో గుండాట ఆడింది. కోతముక్క లక్షల నోట్లకట్టల కట్లుతెంపింది. తమ జాతకాన్ని పరీక్షించుకునేందుకు ఎంతోమంది అదృష్టాన్ని నెంబర్లాట తారుమారుచేసింది. మద్యం ఏరులైపారింది. సంప్రదాయం మాటున నిషేధాజ్ఞలను కూడా లెక్కచెయ్యకుండా పందెంరాయుళ్ళు విచ్చలవిడిగా పందాలు వేశారు. డెల్టాప్రాంతంలో వారంముందు నుంచే కోడిపందాలు కోతముక్క జోరందుకుంటే అనధికార అనుమతులతో సోమవారం నుంచి బహిరంగంగానే కోడిపందేలను కొనసాగించారు. భోగి రోజున భారీస్థాయిలో పందాలు కాయటం, నోట్లను విరజిమ్మటం చూస్తే వాటిని నియంత్రించాల్సిన అధికారులు ప్రేక్షకపాత్రగానే మిగిలిపోయారు. గుంటూరు,బాపట్ల,పల్నాడుజిల్లాలో కొన్నిచోట్ల మాత్రమే అధికారపార్టీ నేతల కన్నుసన్నుల్లోనే బరులు ఏర్పాటు చేసి కోడిపందాలను వేశారు.



చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో పందెం వేసేందుకు కోడి పుంజులతో సిద్ధంగా ఉన్న పందెంరాయుళ్ళు

రొంపిచర్ల మండలం కొనకంచి వారి పాలెం, నాదెండ్ల మండలం సాతులూరు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న బరులను పోలీసు అధికారులు ఆదివారం తొలగించారు. పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి పోలీసు అధికారులు చేతులు దులుపుకున్నారు. రొంపిచర్ల మండలం కొనకంచివారి పాలెం సమీపంలో, ఎడ్వర్డ్‌పేట, నరసరావుపేట మండలం దొండపాడు వద్ద అధికారం అండతో కొందరు నేతల నేతృత్వంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారు. కొనకంచివారి పాలెం వద్ద మూడు బరులు ఏర్పాటు చేశారు. కొనకంచివారి పాలెం, దొండపాడు, ఎడ్వర్డ్‌పేటలో సోమవారం పెద్దఎత్తున పందేలు జరిగాయి. పందేలు కాసే వారి కోసం బరుల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ప్రాంతాల్లో మరో రెండు రోజులు పందేలు నిర్వహించనున్నట్లు పందెంరాయిళ్లు చెబుతున్నారు. రాత్రి వేళల్లో కూడా పందేలు నిర్వహించేందుకు ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేశారు. నాదెండ్ల మండలం సాతులూరులో కూడా కోడి పందేల నిర్వహణకు ఏర్పాట్లు జరిగాయి. ఇక్కడ మంగళవారం పందేలు జరగనున్నాయి. పెదకూరపాడు, అమరావతి మండలాల్లో సోమవారం కోడి పందేలను నిర్వహించారు. మండలంలోని ముస్సాపురం, లేమల్లె గ్రామాల్లో భారీఎత్తున బరులు ఏర్పాటు చేశారు. అధికార పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకుల సారథ్యంలో కోడి పందేలు నిర్వహించారు.

తీరప్రాంతంలో జోరుగా...

తీరంలోనూ అధికారపార్టీ నాయకుల ఆధ్వర్యంలో కోడిపందేలు జోరుగా కొనసాగాయి. పందెం రాయుళ్ళు నాలుగు జిల్లాలతోపాటు తెలంగాణా రాష్ట్రం నుంచి వేలాదిగా తరలి రావటంతో భోగిరోజు మొదటిరోజున లక్షలాది రూపాయలు పందేలు జోరుగా సాగాయి. ఈపందేలను రెవెన్యూశాఖ మంత్రి అనగానిసత్యప్రసాద్, జనసేనపార్టీ జిల్లానాయకులు స్థానిక టీడీపీ నాయకులు పలువురు ప్రముఖులు వీక్షించారు. రేపల్లె నియోజకవర్గంలో చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో, వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండలం పల్లెకూనలో భారీగా కోడిపందేలు జరిగాయి. దృష్టి సారించాల్సిన అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తైనా చూసిన దాఖలాలులేవు. అధికారులపై రాజకీయ నాయకులు తీవ్ర ఒత్తిడి తేవటంతో చేసేదిలేక అధికారులు కూడా చేతులెత్తేశారు. దీంతో పందెం రాయుళ్ళు జోరుగా హద్దుఅదుపులేకుండా పందాలను నిర్వహించారు. ఈరెండుచోట్ల అధికార పార్టీ ప్రధాన నాయకుని ఆధ్వర్యంలో పదిహేను బరులను ఏర్పాటు చేసి పందేలు నిర్వహించారు. బరుల సమీపంలోనే హైటెక్ క్లబ్‌ల తరహాగా పేకాట కోసం ప్రత్యేక గుడారాలు వేసి పేకాట, కోతముక్క ఆటలు జోరుగా కొనసాగించారు. లక్షలాది రూపాయలతో వేలాది మంది పందెంరాయుళ్ళు పాల్గొని పందేలను వేశారు. తూర్పుపాలెంలో రూ.10వేలు, రూ.20వేలు, రూ.50వేలు, రూ.లక్ష వరకు ప్రత్యేక బరులను ఏర్పాటు చేసి నిర్వాహకులు పందేలు నిర్వహించారు. వీఐపీ బరుల్లో రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు కోడిపందేలు నిర్వహించారు. గుండాట, నెంబర్లాట విచ్చలవిడిగా కొనసాగించారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి, తెలంగాణా రాష్ట్రం నుంచి వేలాదిగా పందెం రాయుళ్ళు తరలివచ్చారు. పల్లెకూనలో ఆరు బరులు ఏర్పాటు చేసి కోడిపందేలు జోరుగా కొనసాగించారు. బరుల సమీపంలో ఒక్కో బరిలో రెండు స్టాల్స్ ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలు భారీగా జరిపారు. విద్యుత్ శాఖాధికారులు నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా, విద్యుత్ లైన్లు లాగి భారీ సంఖ్యల్లో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు.



పెదకూరపాడు మండలం ముస్సాపురం గ్రామంలో కోడి పందాల బరి

సాహిత్యరంగానికి లక్ష్మీనారాయణ ఎనలేని సేవ

● మాజీ మంత్రి ఆలపాటి


లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

తెనాలి అర్బన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సాహిత్య రంగానికి అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ ఎనలేని సేవ చేశారని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో సోమవారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మట్టి మనిషి మహానాటకం ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకోనున్న లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించారు. అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు అధ్యక్షతన జరిగిన సభలో ఆలపాటి మాట్లాడుతూ పాశ్చాత్య నాగరికత కారణంగా రంగస్థలానికి ప్రాధాన్యం తగ్గుతున్నప్పటికీ ఎంతోమంది అభిమానులు, దాతలు వాటిని ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. నాటకం ప్రదర్శించిన 50 మంది నటీ నటులు, సాంకేతిక నిపుణులను సత్కరించారు. ఈదర వెంకటపూర్ణచంద్, వల్లూరు శివప్రసాద్, బుర్రా సాయిమాధవ్, కనపర్తి బెన్‌హర్, షేక్ జానీబాషా పాల్గొన్నారు.

వైసీపీని వీడనున్న మాజీ ఎమ్మెల్యే రాజశేఖర్

● మరోసారి పరాభవంతో కుమిలిపోతున్న మర్రి
● ఇన్‌చార్జ్ బాధ్యతలతో పాటు అతని భార్యకు సీటిస్తానని మాట ఇచ్చి తప్పిన జగన్
● గుంటూరులో ఓడిన రజినీకి తిరిగి చిలకలూరిపేట పగ్గాలు
● అప్పటి నుంచి రగిలిపోతున్న రాజశేఖర్



గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వరుస పరాభవాలతో కుంగిపోతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ వైసీపీని వీడేందుకు సిద్ధమయ్యారు. వైసీపీ ఆవిర్భావ సమయంలో జిల్లాలో ఆ పార్టీకి రథ సారథ్యం వహించి ఎంతో అంకితభావంతో పనిచేసి నప్పటికీ పార్టీలో నుంచి అతన్ని పంపించేందుకు తొలి నుంచి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. 2004లో ఆయన వైఎస్ రాజశేఖరరెడ్డికి వీరవిధేయుడిగా ఉండి ఆ ఎన్నికల్లో చిలకలూరిపేట నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2009 ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ తరుపున పోటీచేసి ఓడిపోయినప్పటికీ నియోజకవర్గాన్నే అంటి పెట్టుకొని పార్టీ పురోభివృద్ధి కోసం పనిచేశారు. అనంతరం వైసీపీ ఆవిర్భావంతో జగన్ వెంట పయనించి జిల్లా పార్టీ పగ్గాలు చేపట్టారు. 2014 ఎన్నికల్లో ఆ పార్టీ తరుపున పోటీ చేసి పరాజయం పాలైనా నియోజకవర్గాన్నే అంటిపెట్టుకొని ఉన్నారు. అయితే 2019లో ఆయనకు చివరి క్షణంలో సీటు నిరాకరిస్తూ కొత్తగా పార్టీలో చేరిన విడదల రజినీకి సీటు ఇచ్చారు.

ఎమ్మెల్సీ.. మంత్రి పదవి ప్రకటించి కూడా..

ఆ ఎన్నికల ప్రచారంలో భాగంగా చిలకలూరిపేట వచ్చిన జగన్ సభలో మాట్లాడుతూ రజినీని గెలిపిస్తే రాజశేఖర్‌కు ఎమ్మెల్సీ పదవితో పాటు మంత్రి పదవిని ఇచ్చి తన కేబినెట్‌లోకి తీసుకుంటానని ప్రకటించాడు. అయితే పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ మంత్రి పదవి అటుంచి రెండేళ్ల పాటు కనీసం ఎమ్మెల్సీ హోదా కూడా కల్పించలేదు. అయితే పుండు మీద కారం చల్లినట్లు రాజశేఖర్‌కు ఇస్తానని చెప్పిన మంత్రి పదవిని రజినీకి ఇచ్చారు. దీంతో అప్పట్లోనే ఆయన అనుయాయులు అతన్ని పార్టీ వీడి టీడీపీలో చేరమని ఒత్తిడి చేశారు. ఈ నేపథ్యంలో మర్రికి ఒట్టి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. తిరిగి 2024 ఎన్నికల సమయానికి రజిని తిరిగి చిలకలూరిపేట నుంచి గెలవదని భావించి గుంటూరు పశ్చిమకు తీసుకొచ్చారు. ఆ సమయంలోనైనా స్థానికంగా పట్టున్న రాజశేఖర్‌కు ఎమ్మెల్యే సీటు ఇవ్వకుండా స్థానికేతరుడైన గుంటూరు మేయర్‌ను చిలకలూరిపేట నుంచి బరిలోకి దించి చేతులు కాల్చుకున్నారు. ఇక రజినీ గుంటూరులో కూడా ఓడిపోయిన విషయం తెలిసిందే. ఆ సమయంలో తిరిగి మర్రిని జగన్ తన వద్దకు పిలిపించుకొని ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ముఖ్య నేతల సమక్షంలో ఈసారి చిలకలూరిపేట ఇన్‌చార్జ్ బాధ్యతలు అతనికే ఇస్తానని చెప్పటమే కాకుండా, ఎమ్మెల్యే సీటు అతని భార్యకు ఇస్తానని, ఈ విషయాన్ని త్వరలో ప్రకటిస్తానని చెప్పి పంపించారు.

మళ్లీ రజినీకే బాధ్యతలు అప్పగించడంతో..

అయితే కొద్ది రోజులకే జగన్ హఠాత్తుగా తిరిగి రజినీకి చిలకలూరిపేట ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ వచ్చే ఎన్నికల్లో అక్కడ నుంచే పోటీ చేసేందుకు పరోక్షంగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో మరోసారి మర్రి విషయంలో వైసీపీ అధినేత మాట తప్పి అవమాన పరిచాడు. ఈ పరిణామాన్ని జిల్లాలోని ఆ పార్టీ పెద్దలు సైతం జీర్ణించుకోలేకపోయారు. దీంతో మర్రికి ఇక వైసీపీలో తాను ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కదనే నిర్ణయానికి వచ్చారు. ఒక రకంగా చిలకలూరిపేట అంటే కాంగ్రెస్ హయాంలో మర్రి మామ సోమేపల్లి సాంబయ్య పేరు ఆ తరువాత కాంగ్రెస్‌లోనూ, వైసీపీలోనూ రాజశేఖర్ పేరే వినిపించేది. అటువంటి రాజకీయ చరిత్ర ఉన్నప్పటికీ ప్రస్తుతం అనామకుడిగా ఉండాల్సి వస్తుందని ఆయన రగిలిపోతున్నారు. మర్రి పరిస్థితిని గమనించి వైసీపీలో ఉండగా తనకు అత్యంత ఆత్మీయుడిగా ఉన్న రాజశేఖర్‌ను టీడీపీలోకి తీసుకొచ్చేందుకు కొద్ది రోజులుగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అదే విధంగా నియోజకవర్గంలోని తన అనుయాయుల నుంచి కూడా తీవ్రస్థాయిలో ఒత్తిడి వస్తుండటంతో సంక్రాంతి పండగ తరువాత మంచి ముహూర్తం చూసుకొని టీడీపీలో చేరే ఉద్దేశంలో రాజశేఖర్ ఉన్నట్టు తెలిసింది. ఇప్పటికే జగన్‌కు ఈ సమాచారం అందటంతో జిల్లాలోని వైసీపీ నేతలను పురమాయించి అతన్ని ఆపే ప్రయత్నం చేయమని చెప్పినప్పటికీ జిల్లా నేతలు చేతులు ఎత్తేసినట్టు తెలిసింది. ఒకటి కాదు రెండు కాదు వరుస పరాభవాలతో ఆగ్రహంతో ఉన్న మర్రిని ఏమని సముదాయించగలమనే భావనతో వారు మిన్నకుండిపోయినట్లు తెలిసింది.

పేదలకు నాట్కో వైద్య సేవలు అభినందనీయం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్


మునిపల్లెలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నాట్కో సంస్థ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. మండల పరిధిలోని మునిపల్లె గ్రామంలో నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలను సోమవారం ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, మేనేజింగ్ ట్రస్టీ, నాట్కో ఫార్మ లిమిటెడ్ సీఎస్ఆర్ అధిపతి కంటమణి స్వాతి ప్రారంభించారు. నాట్కో సంస్థల అధినేత నన్నపనేని వెంకయ్య చౌదరి స్వగ్రామం గోళ్లమూడిపాడు గ్రామ సమీపంలో ఈ ఆస్పత్రిని నిర్మించారు. ఆస్పత్రిని ప్రారంభించిన అతిథులు వివిధ విభాగాలను సందర్శించి వైద్య సేవలుపై ఆరా తీశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ మునిపల్లె గ్రామంలో నాట్కో ట్రస్ట్ సహకారంతో గ్రామీణ ప్రాంతంలో మంచి నాణ్యతతో కూడిన కంటి వైద్యాన్ని అందించడం హర్షణీయం అన్నారు. ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ నేత్ర వైద్యం అందించడంలో ముందంజలో ఉందని కొనియాడారు. రెండున్నర ఎకరాలలో రూ. 15 కోట్ల వ్యయంతో నిర్మించిన హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్య పరికరాలు అందించి, సమగ్ర కంటి వైద్య సేవ అందించటానికి ముందుకు వచ్చారన్నారు. నాట్కో మేనేజింగ్ ట్రస్టీ స్వాతి మాట్లాడుతూ 5 లక్షల జనాభాకు సేవలు అందించే విధంగా ఈ హాస్పిటల్‌లో రూపొందించినట్లు చెప్పారు. ఏడాదికి ఐదు వేల శస్త్రచికిత్సలు అందించే సామర్థ్యంతో హాస్పిటల్ నిర్మించినట్లు తెలిపారు. డాక్టర్లు మినహా మిగిలిన సిబ్బంది మొత్తాన్ని స్థానికులనే ఎంపికచేసి శిక్షణ ఇచ్చి కేంద్రంలో నియమించినట్లు చెప్పారు. అర్హులైన పేద ప్రజలకు ఉచితంగా కంటి వైద్య సేవలు అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాట్కో ఫార్మ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నన్నపనేని సదాశివరావు, ఆనందబాబు, తులసి, ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ డాక్టర్ రాజీవ్ రెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ రోహిత్ కన్నా, నెట్వర్క్ డైరెక్టర్ జీపీఆర్ఎస్ ఐ కేర్ డాక్టర్ అనన్య, ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ విజయవాడ బ్రాంచ్ హెడ్ డాక్టర్ ప్రవీణ్, కృష్ణ, వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, పక్కన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ఎన్టీఆర్ మహోన్నతుడు

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

సత్తెనపల్లి రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సినీ, రాజకీయ రంగాల్లో తారాస్థాయికి ఎదిగి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహోన్నతుడు ఎన్టీఆర్ అని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం దీపాలదిన్నెపాలెం గ్రా మంలో సోమవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ జరిగింది. కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ ఎన్టీఆర్ అంటేనే ఒక సంచల నం అన్నారు. ఆయన ఆశయాలను ముందు కు తీసుకువెళ్లి ప్రతి ఒక్కరూ ఆయన బాటలో నడవాలన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాజకీయాల్లో ఎన్టీఆర్ ఒక చరిత్రను సృష్టించారన్నారు. సంక్షేమం అంటే గుర్తుకు వచ్చేది ఎన్టీఆర్ అని, తరాలు మారినా ప్రజల గుండెల్లో ఆయన స్థానం పదిలం అన్నారు. ముందుగా ఎంపీ, ఎమ్మెల్యేలు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూల దండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలకు ఘనస్వాగతం పలికారు. విగ్రహ ఏర్పాటు స్థల దాత పారుపల్లి నాగేశ్వరరావు, విగ్రహదాత పారుపల్లి పాండు రంగారావును ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ మాగులూరి భాను ప్రకాష్, దరువూరి నాగేశ్వరరావు, పార్టీ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు పాటిబండ్ల పూర్ణచంద్రరరావు, కిలారు క్రిష్టగిరి సుమన్(గిరి), దేవరపల్లి వెంకటేశ్వరరావు, పాటిబండ్ల త్రినాథ్(చింటు), పారుపల్లి అనీల్, పారుపల్లి సాయిబాబు, నారుకొండ వీర వర ప్రసాదు, బోడెపూడి కోటేశ్వరరావు, గోళ్ళమూడి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గౌతమబుద్ధుని సూక్తులు ఆచరించాలి


బౌద్ధ స్థూపం వద్ద దీపోత్సవంలో పాల్గొన్న బౌద్ధభిక్షువు బోధిహిన్, ఉపాసకులు

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సమ సమాజంలో శాంతి, సౌఖ్యం విరజిల్లాలంటే గౌతమ బుద్ధుని ఆశయాలు, సూక్తులు ప్రజలంతా ఆచరించాలని శ్రీలంక బౌద్ధ భిక్షువు బోధిహిన్ పేర్కొన్నారు. సోమవారం పౌర్ణమి పురస్కరించుకుని మండల కేంద్రం భట్టిప్రోలులోని బౌద్ధారామంలో స్థూపం చుట్టూ ప్రదక్షిణలు చేసి దీపారాధన చేశారు. అనంతరం సుదర్శన మోహనరావు అధ్యక్షతన జరిగిన సభలో బౌద్ధ భిక్షువు బోధిహిన్ మాట్లాడుతూ మనిషి చెప్పిన ప్రకారం అతని ఆత్మ నడుచుకున్నప్పుడే సమాజంలో శాంతి విరాజిల్లుతుందన్నారు. బుద్ధుని సూక్తులను వివరించారు. స్థూపం ఆవరణలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని సూచించారు. ప్రకాశం జిల్లా ఏఎస్పీ ఎంఎస్ఎస్ అశోక్‌బాబు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బుద్ధిజాన్ని స్వీకరించారని చెప్పారు. కార్యక్రమంలో తుపాకుల హరిప్రసాద్, ఏవీఎస్ రాజు, ఈగ శ్రీనివాసరావు, క్రాంతి, కసుకుర్తి హరిప్రసాద్, తిరుమలశెట్టి ప్రసన్నకుమార్, బౌద్ధఉపాసకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పడవ పోటీల్లో.. విజేతగా రామాపురం పల్లెకారుల జట్టు


ఆత్రేయపురం పడవ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన రామాపురం పల్లెకారుల జట్టు

దాచేపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో జరిగిన పడవ పోటీల్లో పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం రామాపురం పల్లెకారుల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. సేకరించిన వివరాల మేరకు.. కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో సంక్రాంతి పండగకు పడవ పోటీలు నిర్వహించడం ఆనవాయితీ. పడవ పోటీలకు కేరళ, విజయవాడ, కృష్ణా, నాగాయలంక, కోటిపల్లి, ఎన్టీఆర్, భీమవరం జిల్లాల నుంచి హాజరయ్యారు. ఈ క్రీడలకు అన్నిజిల్లాలతోపాటు పల్నాడు జిల్లా, దాచేపల్లి మండలం, రామాపురం గ్రామానికి చెందిన పల్లెకారులు హాజరయ్యారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పల్లెకారులు తమ ప్రతిభను విశేషంగా చాటి మొదటిస్థానంలో నిలిచారు. పల్నాడు ప్రాంతానికి చెందిన పల్లెకారులు కోనసీమ జిల్లాలో పోటీ పడవలు నడిపే జట్ల కంటే అత్యంత నైపుణ్యంగా ముందుగా నడిపి స్థానికుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. స్థానిక కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేతుల మీదుగా లక్ష రూపాయల నగదు, షీల్డు అందుకున్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారిలో జట్టు కెప్టెన్ మల్లాడి సైదులు, పొప్పుడి వీరబాబు, తేలు చినరాజు, కర్రా నాగరాజు, కర్రా రాంబాబు, కొల్లి జాని, కొల్లి సందీప్, మల్లాడి చినసైదులు, చోడారి కిరణ్, మల్లాడి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు మరో జట్టు కూడా పాల్గొంది.

విశ్రాంత ఎస్పీ మాణిక్యాలరావు మృతి


మాణిక్యాలరావు (ఫైల్‌ఫొటో)

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఎస్పీ ఉద్దంటి మాణిక్యాలరావు (75) అనారోగ్యంతో గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఆయన 1970లో ఎస్‌ఐగా శిక్షణ పూర్తి చేశారు. ఎస్‌ఐగా తాడికొండ, పట్టాభిపురం, లాలాపేట తదితర స్టేషన్‌లలో, సీఐగా తెనాలి, గుంటూరు ఈస్ట్, నెల్లూరు ఏసీబీ, కాకినాడ సివిల్ సప్లయస్, జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో పని చేశారు. డీఎస్పీగా ఖాజీపేట, పాలకొండ, గుంటూరు ఇంటిలెజెన్స్‌లో పని చేశారు. కరీంనగర్‌లో ఏఎస్పీగా, ఎస్పీగా పని చేస్తూ 2007లో ఉద్యోగ విరమణ చేశారు. ఏపీ విశ్రాంత పోలీసు అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎ.రవిచంద్ర, ఎం రంగప్రసాదరావు, డి.సుబ్బారెడ్డి, గౌరవ అధ్యక్షుడు వెల్లంకి లక్ష్మీనారాయణ, వాసుదేవరెడ్డి, భూపాల్ సింగ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మాలకొండయ్య, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఆర్ నాయుడు, విశ్రాంత డీజీపీ రాజీవ్ త్రివేది, ఎంవీ కృష్ణారావు, జి.నారాయణ స్వామి సంతాపం తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కొత్తపాలెం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం


● 30 గొర్రెలతోపాటు కాపరి మృతి


బాధితులతో చర్చిస్తున్న పోలీసులు
తిరుపతయ్య (ఫైల్)

వినుకొండటౌన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి) ఆర్టీసీ బస్సు ఢీకొని 30 గొర్రెలతో పాటు గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తపాలెం గ్రామ సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కర్రె తిరుపతయ్య (18) అడవిలో గొర్రెలను మేపుకుని ఇంటికి వస్తుండగా వినుకొండ డిపోకు చెందిన బస్సు, ఎర్రగొండపాలెం నుంచి వినుకొండ వస్తూ ప్రమాదవశాత్తూ గొర్రెల మందపైకి దూసుకుపోయింది. సుమారు 30 గొర్రెలతో పాటు, కాపరి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో మార్కాపురం- వినుకొండ జాతీయ రహదారి రక్తసిక్తమైంది. మృతిని బంధువులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ సమీర్‌బాష రోడ్డుపై నిర్జీవంగా ఉన్న గొర్రెలను తొలగించారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఎ.శ్రీనివాసరెడ్డి సంఘటనా ప్రాంతం నుంచి పరారైనట్లు స్థానికులు తెలిపారు. మరో ఐదు నిమిషాల్లో కన్నకొడుకు ఇంటికి వస్తాడని భావించిన తల్లిదండ్రులు గాలెయ్య, రవణమ్మ మృతి చెందాడని తెలిసి కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇద్దరు కుమారుల్లో చిన్న కుమారుడు మృతి చెందాడు. ఎస్‌ఐ సమీర్‌బాష కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాధితులు తమకు న్యాయం చేయాలంటూ జాతీయ రహదారిపై అర్ధరాత్రి వరకూ ధర్నా చేశారు. దీంతో టీపీపీ జీపీ ఆంజనేయులు సూచన మేరకు సీఐ శోభన్‌బాబు బాధితులతో చర్చించి న్యాయం చేస్తామని రాతపూర్వక హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

కొత్తపేటలో భారీ చోరీ

● 379 గ్రాముల బంగారం, ఐదు వేలు నగదు అపహరణ


దొంగలు లూటీ చేసిన బీరువా, పక్కన బాధితులు

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపేట రంగా బొమ్మ వెనుక శ్రీలక్ష్మీ హాస్పిటల్స్ పక్క వీధిలో నివాసం ఉంటున్న దేవరకొండ వెంకటరమణ ఇంటిలో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. సుమారు రూ. 27 లక్షల ఖరీదైన 379 గ్రాముల బంగారు ఆభరణాలు, ఐదువేల నగదు అపహరించుకుపోయారు. వెంకట రమణకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గతంలో వెంకటరమణ ఆటో నడిపేవారు. కళ్లు సరిగా కనిపించకపోవడంతో ఆటో నడపడం మానేశారు. ముగ్గురు కుమార్తెలు వేర్వేరు చోట్ల ఉండి చదువుకుంటున్నారు. పండగకు ఇంటికి వచ్చారు. బంగారం పెట్టుకోవాలని బ్యాంకులో ఉంచిన ఆభరణాలను ఇంటికి తెచ్చుకున్నారు. ఆదివారం రాత్రి వెంకటరమణ, భార్య, ముగ్గురు కుమార్తెలు ముందుగానే నిద్రించారు. అయితే పడుకున్న సమయంలో తలుపునకు లోపల గడివేయడం మర్చిపోయారు. దీంతో దొంగలు సులువుగా ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో బంగారం పెట్టి తాళాలను పరుపు దిండు కింద ఉంచారు. దీంతో దొంగలు తాళాలు తీసుకొని బీరువా తెరిచి అందులో ఉంచిన బంగారాన్ని అపహరించుకుపోయారు. సోమవారం ఉదయం చోరీ జరిగిన విషయాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వీరయ్య చౌదరి, క్లూస్ టీం ఇంటిని పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 564.30 అడుగులు ఉంది. ఇది 242.48 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9800 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6556 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 8246 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 16,002 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130,139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

పల్నాడు వార్తలు

మాచర్ల • గురజాల • సత్తెనపల్లి • పెదకూరపాడు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

మాచర్ల రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 13వ వార్డుకు చెందిన కందుకూరి ఆంజనేయులు సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ సీనియర్ నేత కంభంపాటి అనిల్‌కుమార్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 5 వేల ఆర్థికసాయం అందించారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

మాచవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మాచవరంలోని షాదీఖానాలో నరసరావుపేట రామలింగారెడ్డి మాక్సీవిజన్ కంటి ఆస్పత్రి వారి సహకారంతో మంగళవారం నేత్ర ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు సోమవారం తెలిపారు.

మిర్చి పంట ధ్వంసం

మాచర్ల రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): చేతికొచ్చిన మిర్చి పంటను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన సంఘటన మండలంలోని జమ్మలమడకలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గొబ్బూరి కోటయ్య తనకున్న మూడెకరాల పొలంలో మిర్చి సాగు చేశారు. పంట చేతికొచ్చిన సమయానికి ఎకరం పొలంలో మిర్చి పంటను గుర్తు తెలియని వ్యక్తులు మిర్చి మొక్కలను తుంచేసి ధ్వంసం చేశారు. దీనిపై బాధితుడు కోటయ్య మాచర్ల రూరల్ పోలీస్‌స్టేషన్లో సోమవారం ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్‌ఐ మణికృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గోకులాలను ఉపయోగించుకోండి

దాచేపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం అందిస్తున్న గోకుల పథకాలను ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలని దాచేపల్లి ఏపీవో మల్లికార్జునరావు రైతులను కోరారు. సోమవారం దాచేపల్లి మండలంలోని పొందుగల, మాదినపాడు, ముత్యాలంపాడు, తక్కెళ్లపాడు గ్రామాలలో పర్యటించారు. ప్రభుత్వం 2 లక్షల 60 వేల రూపాయలు రైతులకు పథకం ద్వారా అందిస్తుందని వివరించారు. ఈ పథకాన్ని ఉపయోగించుకోవడం ద్వారా ఆర్థికంగా పురోగతి సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు టంటం సైదారావు, సోము ప్రసాద్, బండి వెంకటేశ్వర్లు, బండి శ్రీనివాసరావు, సయ్యద్ రసూల్ తదితరులున్నారు.

డ్రోన్‌తో కోడి పందేలను పట్టుకుంటాం

దాచేపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ టెక్నాలజీతో అక్రమ చర్యలను అడ్డుకుంటామని దాచేపల్లి సీఐ భాస్కరరావు స్థానికులకు తెలిపారు. సోమవారం పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాలతో సంక్రాంతి పండగ సందర్భంగా శాంతి భద్రతలను కాపాడటంలో టెక్నాలజీని వాడుతున్నట్లు ఆయన వివరించారు. జూదం, కోడిపందేలు, గంజాయి వంటి అక్రమ కార్యకలాపాలను నియంత్రించేందుకు డ్రోన్ టెక్నాలజీని సమర్థవంతంగా ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణకు, భద్రతకు డ్రోన్ సాంకేతికత కీలకపాత్ర పోషిస్తుంది. డ్రోన్ నిఘాను గామాలపాడులో విజయవంతంగా ప్రదర్శించి ప్రజల భద్రతకు పోలీసులు కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు.

వీధుల్లో భోగి సంబరాలు


మాచర్లలో భోగి మంటలు వేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

రెంటచింతల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం ముగింపు సందర్భంగా భోగి వేడుకలు ఘనంగా జరిపారు. పెద్ద పెద్ద మంటలు వేస్తూ ఇంట్లో పనికిరాని వస్తువులను మంటల్లో వేశారు.

- వెల్దుర్తి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భోగి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే భోగి మంటలు వేశారు.
- మాచర్లటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో సోమవారం రోటరీక్లబ్ ఆధ్వర్యాన భోగి మంటలు, కోడి పందేలు, గాలిపటాలు ఎగురవేసే కార్యక్రమాలు నిర్వహించారు.
- మాచవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం భోగి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.
- నకరికల్లు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో సోమవారం భోగి వేడుకలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.
- సత్తెనపల్లి రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : భోగి పండుగను మండల ప్రజలు సోమవారం వేడుకగా జరుపుకున్నారు.
- మాచర్లటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ, మండల పరిధిలో సోమవారం భోగి పండుగను ప్రజలు వైభవంగా నిర్వహించుకున్నారు.
- ముప్పాళ్ళ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం భోగి మంటలను వేసి ప్రజలు కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు. అనంతరం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- బెల్లంకొండ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం భోగి వేడుకలను వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున 5 గంటల కల్లా బెల్లంకొండ మెయిన్ సెంటర్‌లో భోగి మంటలు వేశారు.
- క్రోసూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): క్రోసూరులోని పలు ప్రదేశాల్లో సోమవారం భోగి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. కరణం బజారు, విద్యా నగర్, కాంద్రు కాశయ్య గృహం, నాలుగు రోడ్ల సెంటర్ పరిసర ప్రాంతాల్లో భోగి మంటలు వేశారు.


క్రోసూరు కరణం బజారులో ఉత్సాహంగా భోగి మంటలు

- అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రజలు సోమవారం భోగి పండగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఇళ్ల ముందు భోగి మంటలు వేశారు.
- రాజుపాలెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలలో భోగి పండగను ఘనంగా నిర్వహించారు. భోగి, సంక్రాంతి, కనుమ పెద్ద పండుగలు కావటంతో బంధువుల రాకతో గ్రామాలు కళకళలాడుతున్నాయి.

వేడుకగా గోదాదేవి కల్యాణం

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి) భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని అమరేశ్వరస్వామి ఆలయాన్ని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు దంపతులు సందర్శించారు. అత్తలూరు గ్రామంలోని రామాలయంలోని సంప్రదాయ పీఠంను భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ సందర్శించి పూజలు నిర్వహించారు.

రెంటచింతల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని వేణుగోపాలస్వామి, రెంటాలలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్ల ఆలయాల్లో సోమవారం గోదాదేవి రంగనాథ స్వామి కల్యాణాన్ని నేత్రపర్వంగా జరిపారు.
పిడుగురాళ్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): షిరిడీ సాయిమందిర్, కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం, కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో, మార్కెట్ యార్డు వద్ద వున్న అభయాంజనేయస్వామి దేవాలయంలో గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

సత్తెనపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసంలో భాగంగా సోమవారం రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న వెంకటేశ్వర స్వామిని పూలతో, తులసీ ఆకులతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని సందర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వైభవంగా గోదాదేవి కల్యాణం


మాచర్లలో ప్రత్యేక అలంకరణలో గోదాదేవి అమ్మవారు

కారంపూడి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నకేశవస్వామి దేవాలయంలో గోదాదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణాన్ని వేద పండితులు వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామి వార్లకు ఎదురుకోల నిర్వహించారు. కల్యాణ ఘట్టాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు కొమండూరి సత్యనారాయణాచార్యులు జరిపారు.


సత్తెనపల్లిలో విశేష అలంకరణలో వెంకటేశ్వర స్వామి

మాచర్లటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతూరు వడ్డెరపాలెంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కన్నెగంటి శ్రీనివాసాచారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

దాచేపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గోదా రంగనాయకస్వామి వారి కల్యాణం సోమవారం వందలాది భక్తుల సమక్షంలో విశేషంగా జరిగింది.

అచ్చంపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేటలోని సీతారామ స్వామి వారి దేవాలయం ఆధ్వర్యంలో మోహినీ అవతారంలో అమ్మవారిని పుర వీధుల్లో సోమవారం ఊరేగింపు నిర్వహించారు.

క్రోసూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరులోని పురాతన వేణుగోపాల స్వామి దేవాలయం, నరసింహా స్వామి దేవాలయాల్లో సోమవారం సాయంత్రం గోదాదేవి కల్యాణం కన్నులపండువగా జరిగింది.

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి) ఆరుద్రోత్సవ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం అమరేశ్వరస్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించారు. ఉదయం 3గంటలకు మహాన్యాసం అనంతరము అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరము స్వామివారికి ప్రత్యేక అలంకారము చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరము భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈవో సునీల్‌కుమార్‌తో పాటు అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. అన్నాభిషేకం కార్యక్రమాన్ని ఎంఎల్‌ఏలు భాష్యం ప్రవీణ్, యార్లగడ్డ వెంకట్రావు తిలకించారు.

సంక్రాంతి శుభాకాంక్షలు: ఎంపీ

సత్తెనపల్లి రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దీపాలదిన్నెపాలెం గ్రామంలో ఎన్‌టీఆర్ విగ్రహావిష్కరణకు వచ్చిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు గ్రామ మహిళలు ఆప్యాయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ ప్రతి ఒక్క మహిళను ప్రత్యేకంగా పలుకరించి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు: భాష్యం

పెదకూరపాడు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సంక్రాంతి శుభాకాంక్షలను సోమవారం తెలిపారు. సంక్రాంతి పండగ అందరి ఇళ్ళల్లో సంతోషాన్ని నింపాలని, అందరూ ఆయురారోగ్యాలతో భోగ భాగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కాగా మాజీ శాసన సభ్యులు, టీడీపీ జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ కూడా నియోజక వర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలను తెలిపారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

మాచర్లటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. సోమవారం వెల్దుర్తిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తిరుపతిలోని ప్రముఖ కంపెనీ మాచర్ల నియోజకవర్గ పరిధిలోని 1000 మంది యువతకు ఉపాధి కల్పించేందుకు ముందుకు వచ్చిందన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, ఐటీఐ ప్లస్ అప్రంటీష్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ పరిధిలోని టీడీపీ కార్యాలయంలో సంప్రదించాలని ఎమ్మెల్యే జూలకంటి సూచించారు.

తోట చంద్రయ్యకు నివాళి

వెల్దుర్తి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపాడుకు చెందిన టీడీపీ నేత తోట చంద్రయ్య వర్ధంతిని సోమవారం గ్రామంలో నిర్వహించారు. శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి చంద్రయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. మూడేళ్ల క్రితం చంద్రయ్య టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తుండడంతో ఆయన్ను వైసీపీ నేతలు హత్య చేశారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ చంద్రయ్య కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందన్నారు.

సామినేని ఫౌండేషన్ సేవలు అభినందనీయం

గుంటూరు(తూర్పు), జనవరి 13(ఆంధ్రజ్యోతి): పేద, ప్రతిభ కలిగిన విద్యార్థులకు అండగా నిలుస్తున్న సామినేని ఫౌండేషన్ సేవలు అభినందనీయమని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. స్థానిక విద్యానగర్‌లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఇంజనీరింగ్ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ చేశారు. ఫౌండేషన్ సభ్యులు సామినేని నాగేశ్వరరావు, తుమ్మల రమాదేవి, సామినేని రవి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రక్కు రివర్స్ పోటీలు

దుర్గి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పెట్రోల్ బంకు సమీపంలో సోమవారం జిల్లా స్థాయి ట్రాక్టర్ ట్రక్కు రివర్స్ పోటీలు జరిపారు. ఈ పోటీల్లో గురజాల మండలం జనార్థనపురం గ్రామానికి చెందిన చెరుకూరి శ్రీనివాసరావు విజేతగా నిలిచారు. దుర్గి మండలం ఓబులేశునిపల్లెకు చెందిన దండెం కోటేశ్వరరావు రెండో స్థానం, రెంటచింతల మండలం తుమ్మకోటకు చెందిన పొట్టిపోగు రాజు మూడోస్థానంలో నిలిచారు.

కోళ్ల కాలు దువ్వాయి

పెదకూరపాడు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పెదకూరపాడు, అమరావతి మండలాల్లో సోమవారం కోడి పందాలను నిర్వహించారు. మండలంలోని ముస్సాపురం గ్రామం, లేమల్లె గ్రామాల్లో జరిగిన ఈ కోడి పందాల కయ్యానికి పెదకూరపాడు, సత్తెనపల్లి, తాడికొండ నియోజక వర్గాలకు చెందిన పలువురు వచ్చారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

క్రోసూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి రంగవల్లులు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు క్రోసూరు ఎస్‌ఐ నాగేందరరావు అన్నారు. సోమవారం మండలంలోని దొడ్లేరులో మండల స్థాయి ముగ్గుల పోటీలు ఉత్సాహభరితమైన వాతావరణంలో నిర్వహించారు. విజేతలకు ఎస్‌ఐ నాగేందరరావు బహుమతులు అందజేశారు. మొత్తం 60 మంది మహిళలు పోటీల్లో పాల్గొన్నారు. మొదటి బహుమతి రూ 10,116లు ప్రవల్లిక గెలుపొందగా, రెండవ బహుమతి రూ. 8,116లు సీతా మహాలక్ష్మి, మూడవ బహుమతి రూ 5,116లు త్రివేణి, నాల్గవ బహుమతి శివ పార్వతి రూ 3,016లు ఎస్‌ఐ చేతుల మీదుగా అందుకున్నారు. ముగ్గుల పోటీల్లో ఆకర్షణీయంగా వేసిన ముగ్గులను స్థానికులు ఉత్సాహంగా తిలకించారు.


ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

మాచవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలు మహిళల్లో ఉత్సాహాన్ని నింపుతాయని జనసేన పార్టీ గురజాల నియోజక వర్గ సమన్వయ కర్త కటకం అంకారావు అన్నారు. సోమవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మాచవరం మండల జనసేన అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆతుకూరి సాయి లక్ష్మి మొదటి బహుమతి పొందగా, ఆతుకూరి శిరీష రెండవ బహుమతి, ఆతుకూరి అక్షయ మూడవ బహుమతి, పమ్మి జయంతి 4వ బహుమతి, ఉల్లి ప్రవలిక 5వ బహుమతిని కైవసం చేసుకున్నారు. పోటీల్లో పాల్గొన్న అందరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు.

దుర్గి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన దుర్గిలో వేంచేసియున్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఆలయ ఆవరణలో జనసేన పార్టీ ఆధ్వర్యాన ముగ్గుల పోటీలు జరిపారు. ఈ పోటీలు తిలకించేందుకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కర్పూరపు నాగజ్యోతి ప్రథమం, అరుణ, శైలజ, శ్రావణిలు తరువాతి స్థానాల్లో నిలిచారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ అధికార ప్రతినిధి నక్షత్రపు ప్రసాద్, బూసా రామాంజినేయులు, పులి హరి, రుద్రాల రవి, కటకం నరేష్, కోరే నాగరాజు, కటకం భువన్నారాయణ పాల్గొన్నారు.

ఉత్తమ ఎస్‌హెచ్‌వోగా సీహెచ్ నాగార్జున



రెంటచింతల, జనవరి 13 (ఆంధ్ర జ్యోతి): ఉత్తమ ఎస్‌హెచ్‌వోగా(స్టేషన్ హౌస్ ఆఫీసర్) రెంటచింతల ఎస్‌ఐ సీహెచ్ నాగార్జునను ఎంపిక చేస్తూ పల్నాడు జిల్లా ఎస్పీ కె శ్రీనివాసరావు సోమవారం ప్రకటించారు. 2018 బ్యాచ్‌కు చెందిన నాగార్జున కావలిలో బీటెక్ పూర్తి చేసిన అనంతరం ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపికై గురజాల, తాడికొండలో పనిచేశారు. ఆ తరువాత డీసీఆర్‌బీ(డిస్ట్రిక్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో)లో సుదీర్ఘ కాలం పనిచేసి ఆగస్టు 14న రెంటచింతల ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టారు. స్టేషన్‌కు వచ్చే వారి పట్ల ఏమండి అనే సంబోధించడం అవార్డు రావడానికి ప్రధాన కారణంగా పలువురు పేర్కొంటున్నారు. అలాగే కానిస్టేబుల్ మమతకు ఉత్తమ మహిళా కానిస్టేబుల్‌గా అవార్డు ప్రకటించారు. ఈమె స్టేషన్లో సీసీటీఎన్‌ఎస్(క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్ వర్కింగ్ సిస్టం)లో పనిచేస్తూ ఎప్పటికప్పుడు అప్డేట్స్‌ను ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు.

పవన్ కల్యాణ్‌ను కలసిన బొర్రా

సత్తెనపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను జనసేన పార్టీ నియోజక వర్గ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు ఆదివారం రాత్రి మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

టీడీపీ, వైసీపీ వర్గీయుల ఘర్షణ

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్డులో గల పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని కంభంపాడు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త తిరుపతయ్య ఆదివారం సాయంత్రం మద్యం తాగి పాత గొడవల నేపథ్యంలో టీడీపీ కార్యకర్తలకు ఫోన్ చేసి వివాదాస్పదంగా మాట్లాడారు. ఆ సమయంలో లేమల్లెలో కోడిపందేలు వద్ద ఉన్న టీడీపీ కార్యకర్తలు అక్కడి నుంచి గుంటూరు వచ్చారు. తొలుత ఎంపీ శ్రీకృష్ణదేవరాయల కార్యాలయం వద్ద ఉన్నానని చెప్పడంతో కృడకు వెళ్లారు. తరువాత మాజీ ఎమ్మెల్యే శంకరరావు కార్యాలయం వద్ద ఉన్నానని చెప్పాడు. దీంతో టీడీపీ కార్యకర్తలు రెండు ద్విచక్ర వాహనాలపై నలుగురు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు కార్యాలయం వద్దకు వచ్చి తిరుపతయ్య కోసం వాకబు చేయగా ఆయన ఆచూకీ లభించలేదు. ఇప్పుడు ఎక్కడున్నావ్ అంటూ తిరుపతయ్యకు ఫోన్ చేయగా ఆయన మరింత రెచ్చిపోయాడు. దీంతో టీడీపీ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఉన్న ఫ్లెక్సీలను చించి వేశారు. ఇది గమనించిన వాచ్‌మన్ మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు వద్ద సూపర్ వైజర్‌గా పని చేసే నరేంద్రకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. దీంతో శంకరరావు ఇంటి వద్ద ఉన్న నరేంద్ర తన వెంట డ్రైవర్ కట్టిపోగు జగదీష్ తో పాటు మరో ముగ్గురిని తీసుకుని శంకర్రావు కార్యాలయం వద్దకు వచ్చాడు. అక్కడ ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. నంబూరు శంకర్రావు సూపర్‌వైజర్, అదేవిధంగా టీడీపీ వర్గీయులు ఇరువురికి గాయాలు అయ్యాయి. నల్లపాడు సీఐ వంశీధర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు.

వేడుకగా.. భోగి

భోగి మంటలు.. భోగిపండ్లు. రంగుల రంగవల్లులు.. బొమ్మల కొలువులు.. ఎగిరే గాలిపటాలు.. హరిదాసుల కీర్తనలు.. గంగిరేద్దుల ఆటలు.. ఘుమ ఘుమలాడే పిండి వంటలతో సంక్రాంతి పండక్కి స్వాగతం పలుకుతూ, వెలుగుల ఉత్తరాయణాన్ని ఆహ్వానించే భోగ భాగ్యాల భోగిని పల్లెలు, పట్టణాల్లో చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామునే పట్టణాలు, పల్లెల్లో ప్రధాన కూడళ్లతో పాటు ఇళ్ల ముంగిళ్ల లో భోగిమంటలు వేసి సంక్రాంతి సంబరాలను వేడుకగా సోమ వారం ప్రారంభించారు. సామాన్య ప్రజలతో పాటు అధికారులు, ప్రజా ప్రతినిధులు భోగి కార్యక్రమాలను వేడుకగా జరుపుకున్నారు. దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో స్వామి కల్యాణోత్సావాలు నేత్ర పర్వంగా జరిగాయి. జిల్లా అంతటా సంక్రాంతి శోభ నెలకొంది.



- ఆలయాల్లో విశేష పూజలు
- శ్రీవారికి కల్యాణోత్సవాలు
- చిన్నారులకు భోగి పండ్లు



తెనాలి జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి మనోహర్



నరసరావుపేట పట్టణంలో భోగి మంటల వద్ద నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగలో మొదటి రోజైన భోగిని అన్ని వర్గాల ప్రజలు కోలాహలంగా జరుపుకున్నారు. దూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన వారు స్వగ్రామాల్లో మిత్రులు కుటుంబ సభ్యులతో కలసి భోగి మంటలు వేసి ఒకరికొకరు అభినందనలు తెలుపుకున్నారు. పిండి వంటల ఘుమ ఘుమలు, బంధువులు, కుటుంబ సభ్యుల సందడితో పల్లెలు శోభిల్లాయి. కుల మతాలకు అతీతంగా రైతులు, వ్యవసాయ కూలీలు జరుపుకునే పండుగ కావడంతో సంక్రాంతి పర్వదినానికి అన్ని వర్గాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారితో పాటు బంధువుల రాకతో గ్రామాల్లో సంక్రాంతి సందడి నెలకొంది. పల్లెల్లో ముగ్గుల పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు నిర్వహించారు. భోగిమంటల అనంతరం దేవాలయాలకు భక్తులు తరలివెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తమ ఇళ్ల ముందు ఒకరికొకరు పోటీ పడి భోగి ముగ్గులతో వాకిళ్లను అందంగా తీర్చి దిద్దారు. ఆ ముగ్గుల్లో గొబ్బెమ్మలను అలంకరించారు. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా గాలి పటాలను ఎగుర వేసి ఆనందోత్సాహలను వ్యక్తం చేశారు.



గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో భోగి మంటను వెలిగిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి కమిషనర్ పులి శ్రీనివాసులు.

చిన్నారులకు పెద్దలు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. భోగి పండుగ రోజు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు తెల్లవారు జామునుంచి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాల్లో గోదాదేవి కళ్యాణోత్సవాలు వైభవంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య కల్యాణోత్స వాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సావాలను కనులారా తిలకించారు.



యడ్లపాడులో భోగి మంటలు వేస్తున్న స్థానికులు



బాపట్ల విజయలక్ష్మీపురంలో భోగి వేడుకల్లో టీడీపీ నేతలు



మాచవరం మండలం వేమవరంలో హరిదాసుకి చిరు ధాన్యాలు వేస్తున్న చిన్నారులు



కొల్లిపరలో గ్రామంలో ఇంట ముంగిళ్లలో డూడూ బసవన్నల సందడి



మాచర్ల పట్టణంలోని 16వ వార్డులో భోగి మంటల వద్ద మహిళలు



వట్టిచెరుకూరులో భోగి మంటలు వేస్తూ ఆనందిస్తున్న స్థానికులు



బాపట్లలో క్షీర భావన్నారాయణ స్వామి దేవాలయం ఎదుట భోగిమంటలు వెలిగిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



రొంపిచర్లలో భోగి మంటల కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

హోరాహోరీగా మంగళగిరి ప్రీమియర్ లీగ్



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో ఉత్కంఠగా సాగుతున్న పోటీలు

మంగళగిరి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగున్న ప్రీమియర్ లీగ్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండో రోజు విజయనగరం-కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కర్నూలు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 115 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విజయనగరం జట్టు 11.04 ఓవర్లలో 3 వికెట్ల నష్టపోయి లక్ష్యాన్ని ఛేదించింది. శ్రీకాకుళంతో జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 120 పరుగులు చేయగా, శ్రీకాకుళం జట్టు 3 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. రెండు మ్యాచ్‌లలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన క్రీడాకారులకు బోగి వినోద్, కనికళ్ల చిరంజీవి సహకారంతో రూ.పది వేల చొప్పున బహుమతిని అందజేశారు. ఈ పోటలకు సేల్, నక్కు, మార్కోరేస్, ఉషోదయ, వి-డిజిటల్ సంస్థలు స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి.

అలరించిన బొమ్మల కొలువు!


ఆసక్తిగా వీక్షించిన మహిళలు



బాపట్ల,జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : బాపట్లపట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో పాపినేని వారి ఇంట బొమ్మలు కొలువు తీరాయి. అంధమైన బొమ్మల అలంకారం నాలుగు దశాబ్దాలుగా ప్రతి ఏటా ఇక్కడ నిర్వహిస్తున్నారు. విశేషంగా ఆకర్షిస్తున్న బొమ్మల కొలువు చూడముచ్చటగా సింగారించుకున్న అలంకారం.... బాపట్లలో కనువిందు చేస్తున్నసింగారం. ప్రతి ఏటా పాపినేని వారి ఇంట కొలువు తీరే అంబరం రమణీయత ఉట్టిపడే అద్భుత సంబరంగా మారింది. వేలాది బొమ్మలు సేకరించి ఆ ఇంట ప్రదర్శించటం ఆనవాయితీగా వస్తున్నది. సంక్రాంతి పర్వదినాలలో ప్రత్యేక ఆకర్షణీయమైన బొమ్మల కొలువు ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. సంక్రాంతిలో కనిపించే ఈ సంస్కృతికి శ్రీకారం చుట్టారు. బాపట్లకు చెందిన పాపినేని ధనలక్ష్మీ కుటుంబం 1984 నుంచి వివిధ రకాల బొమ్మలు సేకరించటం మొదలు పెట్టారు. విహారయాత్రకు వెళ్ళిన ప్రతిసారి కొన్నిబొమ్మలు తీసుకురావటం, ఇంట్లో ప్రదర్శనగా ఉంచటం చేస్తున్నారు. ఒకప్పుడు 10 బొమ్మలతో ప్రారంభించిన ఈ కార్యక్రమం ప్రస్తుతం వేల బొమ్మలు కొలువుతీరాయి. ప్రకృతి రమణీయతను ఉట్టిపడే అందాలు, ఆరుగాలం శ్రమించే అన్నదాతలు, అంధంగా కనిపించే రమణీయ దృశ్యాలు, దేవాలయాలు, దేవుళ్ళ బొమ్మలు, దేశంలోని వివిధ రాష్ట్రాలలో ఉన్న సుప్రసిద్ధ పర్యాటక కేంద్రాలు, పల్లె వాతావరణం ప్రతిబింబించేలా దృశ్యాలు, ముఖ్యంగా మత సామరస్యాన్ని చాటి చెప్పే అందమైన బొమ్మలు సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. ప్రతి ఏటా భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాలలో బొమ్మలు ప్రదర్శిస్తున్నట్లు ధనలక్ష్మీ తెలిపారు.



బాపట్ల పట్టణంలోని పాపినేని వారి ఇంట కొలువు తీరిన బొమ్మల కొలువు



ఈ బొమ్మల కొలువుకు కుటుంబ సభ్యులంత కలిసి వేడుకగా జరుపుకుంటున్నారు. దీనిని తిలకించేందుకు పరిసరప్రాంత మహిళలు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. 15వ తేది వరకు బొమ్మల కొలువు అందుబాటులో ఉంటుందని పాపినేని ధనలక్ష్మీ, పాపినేని రాధాకృష్ణ, పాపినేని నాగదేవి ప్రసాద్‌లు తెలిపారు. సాయంత్రం 6 గంటలు నుంచి 10 గంటల వరకు బొమ్మల కొలువు దర్శించవచ్చని అన్నారు.

నువ్వా.. నేనా..!



- యార్డు కార్యదర్శి పోస్టుకోసం పోటాపోటీ
- గ్రూపు-1 అధికారిణి రానున్నట్లు ప్రచారం
- కొనసాగేందుకు 'వినుకొండ' ముమ్మర ప్రయత్నాలు

గుంటూరు సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మిర్చి ఎగుమతిలో ఆసియాలో నే అతి పెద్దదిగా పిలువబడే గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి పోస్టు కోసం గట్టిపోటీ నెలకొంది.ఈ పోస్టు కోసం ఉత్తరాంధ్ర కు చెందిన గ్రూపు-1 అధికారిణి ప్రయత్నాలు చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆ పోస్టు లో ఉన్న వినుకొండ ఆంజనేయులు పరిస్థితి గందరగోళం గా మారింది. ఏడాది కి సుమారు వేల కోట్ల రూపాయలు పైబడి టర్నోవర్ కలిగిన గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి పోస్టు అంటే ఎప్పుడూ హాట్ కేక్ లా ఉంటుంది. ఈ పోస్టును దక్కించుకునేందుకు మార్కెటింగ్ శాఖ ఉద్యోగులు చెయ్యని ప్రయత్నాలు అంటూ ఉండవు. ఉన్నత స్థాయి రాజకీయ నాయకుల దగ్గర నుంచి రాష్ట్ర అధికారుల దాయదక్షిణ్యాలు మెండుగా ఉంటేనే పోస్టు దక్కుతుంది. ఒక్క సీజన్ లో యార్డు కార్యదర్శి గా పనిచేసినా జీవితం సెటిల్ అవుతుందన్న ఆలోచన తో మార్కెటింగ్ ఉద్యోగులు ఇక్కడ పోస్టింగ్ కోసం నానా తంటాలు పడుతుంటారు.

ఒకరు అక్కడ.. ఒకరు ఇక్కడ

గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి పోస్టు కోసం ప్రయత్నాలు చేస్తున్న గ్రూపు-1 అధికారిణి ఉత్తరాంధ్ర లో ఉన్నత స్థాయి పోస్టు లో వున్నారు. అయితే సదరు అధికారిణి భర్త గుంటూరు జిల్లాలో కీలకమైన పోస్టు లో ఈ మధ్య కాలంలో నే నియమితులయ్యారు.భార్యాభర్తలు ఇరువురు జిల్లా అధికారులు కావటంతో ఒకే చోట ఉండేందుకోసం యార్డు కార్యదర్శి పోస్టు వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. సదరు అధికారిణి కుటుంబంలో కూడా ప్రస్తుత కూటమి ప్రభుత్వం లో కీలకమైన స్థానంలో ఉన్నవారు వున్నారు. దాంతో ఆమె కు పోస్టింగ్ దరిదాపుగా ఖరారు అయినట్లు ప్రచారం జరుగుతోంది.

ఉండేందుకు యత్నాలు..

ప్రస్తుతం గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి గా వినుకొండ ఆంజనేయులు కొనసాగుతున్నారు. ఆయనకు ఇంకా 11 నెలలు మాత్రమే సర్వీసు ఉంది. అప్పటివరకు ఆ పోస్టు లో కొనసాగేందుకు ఆయన ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు.గ్రూపు-1 అధికారిణి నియామకంలో తీవ్ర జాప్యం జరగడంలో ఆంజనేయులు ప్రయత్నాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఆంజనేయులు కు మద్దతుగా ఒక సామాజిక సంఘం ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో కొన్ని పోస్టు లు కూడా పెట్టటం జరిగింది. అయితే వచ్చే గ్రూపు-1 అధికారిణి కూడా అదే సామాజిక వర్గానికి చెందిన వారని తెలియటం తో కొందరు నాయకులు వెనక్కి తగ్గినట్లు సమాచారం.

నేతల జోక్యం..

యార్డు కార్యదర్శి నియామక వ్యవహారంలో కొందరు నేతలు జోక్యం చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆంజనేయులుకు అనుకూలంగా కొందరు, వ్యతిరేకంగా కొందరు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. గ్రూపు- 1 అధికారిణికి అనుకూలంగా కూడా కొందరు రాష్ట్ర నేతలు రంగ ప్రవేశం చేసినట్లు తెలిసింది. వారి చొరవతో నే ఆమె నియామకం దరిదాపుగా ఖరారు అయినట్లు అంతా అనుకున్నారు.అధికారిణి కోసం ప్రయత్నాలు చేస్తున్న రాష్ట్ర నేతలు గుంటూరు కు చెందిన కీలకమైన ప్రజాప్రతినిధులతో కూడా చర్చించినట్లు తెలుస్తోంది.

ఎప్పుడూ అంతే..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి పోస్టు కోసం మినీ యుద్ధం జరిగింది. ఆ పోస్టు లోకి వచ్చేందుకు ఆ శాఖలోని అన్ని స్థాయిల అధికారులు ఉన్నత స్థాయిలో పావులు కదుపుతూ వచ్చారు. చివరకు ఎవరు కమిషనర్‌కు దగ్గరగా ఉంటారో వారికే బాధ్యతలు అప్పగించడం జరిగింది. అయితే ఒక సెక్రటరీకి మాత్రం నేతల చలవతో యార్డు పోస్టు మళ్ళీ మళ్ళీ దక్కింది. ఆ తర్వాత జరిగిన అక్రమాల్లో వీళ్లంతా ఉన్నట్లు విజిలెన్స్ అధికారులు తేల్చారు. మొత్తం మీద యార్డు కార్యదర్శి పోస్టు వ్యవహారం ఏమి జరుగుతుందో వేచి చూడాల్సిందే.

పల్నాడు వార్తలు
◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



నరసరావుపేటలో డ్రోన్లతో ప్రత్యేక నిఘా

● రెండో పట్టణ సీఐ హైమారావు

నరసరావుపేట లీగల్, జనవరి 13, సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు, జూదాలు, బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి సేవించడం, ఈవ్ టీజింగ్ తదితర నేరాలను అరికట్టడానికి పట్టణంలో డ్రోన్ కెమెరాల సాయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు నరసరావుపేట రెండో పట్టణ సీఐ హైమారావు సోమవారం తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారు పట్టుబడినట్లయితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

16న ముగ్గుల పోటీలు

వినుకొండ టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 16వ తేదీన కారంపూడి రోడ్డులోని ఏర్పాటుచేసిన పద్మావతినగర్‌లో నియోజకవర్గ స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు 32వ వార్డు కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొన్న మహిళలకు మొదటి బహుమతి ఏసీ, రెండో బహుమతి 43 అంగుళాల ఎల్‌ఈడీ టీవీ, మూడో బహుమతి వాషింగ్ మిషన్, నాలుగో బహుమతి టేబుల్ టాప్ గ్రైండర్, ఐదో బహుమతి స్టాండ్ ఫ్యాన్‌లతోపాటు పోటీల్లో పాల్గొనే మహిళలకు కన్సొలేషన్ బహుమతులు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. గెలుపొందిన మహిళలకు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఆయన సతీమణి గోనుగుంట్ల లీలావతి బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు 9490014351, 996619925 ను సంప్రదించాలన్నారు.


విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేస్తున్న సీపీఎం నాయకులు

భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం

నరసరావుపేట రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలం పాలపాడులో సీపీఎం రాష్ట్ర పిలుపులో భాగంగా సోమవారం తెల్లవారుజామున భోగి మంటల్లో విద్యుత్తు బిల్లులను సీపీఎం నాయకులు తగలబెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ బిల్లులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో కాల్చి నిరసన తెలిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాలపాడు గ్రామ శాఖ కార్యదర్శి కొమ్ముల నాగేశ్వరరావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తాళ్లూరు పెద్దిరాజు, అనీలు కోటయ్య, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు

జనసేన పార్టీ కార్యాలయాన్ని సందర్శించిన కిలారి

వినుకొండ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వినుకొండకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య కారంపూడి రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు, నాయకులకు పార్టీ అభివృద్ధిపై సోమవారం దిశా నిర్దేశం చేశారు. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం అమ్మవారి దర్శన అనంతరం గుంటూరు వెళుతూ మార్గమధ్యలో పార్టీ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి నిశంకర శ్రీనివాసరావు కార్యకర్తలతో కలిసి ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యకర్తలకు జనసేన పార్టీ విస్తరణపై పలు సూచనలు, సలహాలు అందజేశారు.

పాఠశాల అభివృద్ధికి సహకరిద్దాం: పూర్వ విద్యార్థులు

నాదెండ్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పలువురు కోరారు. సంక్రాంతిపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఐ.జానకీధరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాఠశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ విజయపార్థవి, పూర్వ విద్యార్థులు రామకృష్ణ, సాంబశివరావు, తోట రాము, విశ్రాంత డీవైఈవో శేషుబాబు, ఎస్.శివ ప్రసాదు, కే వీరారెడ్డి, నగేష్, వెంకటేశ్వర్లు, మార్టిన్, వీరాస్వామి, జే బొల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలు

లింగారావుపాలెం (యడ్లపాడు), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల పెద్ద పండుగ సంక్రాంతి పండుగ అని, గ్రామీణ ప్రజల ఆనంతోత్సాహాలకు ఈ పండుగ ప్రతీక అని ఎస్ఐ బాలకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని లింగారావుపాలెంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 45వ క్రీడా సాంస్కృతిక ఉత్సవాలకు ఎస్ఐ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనలోని నైపుణ్యాలను, కళాత్మకతను వెలికితీసేందుకు క్రీడలు, సాంస్కృతిక కళలు ఎంతో దోహదపడతాయన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న ఈ క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామీణులలో ఉత్సాహాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. పోటీలు నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులను ఈ సందర్భంగా ఎస్ఐ అభినందించారు. అనంతరం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు సామినేని శ్రీనివాసరావు, నాయకులు, క్రీడాకారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా భోగి సంబరాలు


వినుకొండలోని కొత్తపేటలో, యడ్లపాడులో సంక్రాంతి పండుగ సందర్భంగా భోగి మంటలు వేస్తున్న గ్రామస్థులు

నరసరావుపేట టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భోగ భాగ్యాల భోగిని పల్లెలు, పట్టణాల్లో చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామునే పట్టణాలు, పల్లెల్లో ప్రధాన కూడళ్లతో పాటు ఇళ్ల ముంగిళ్లలో భోగి మంటలు వేసి సంక్రాతి సంబరాలను వేడుకగా సోమవారం ప్రారంభించారు. నరసరావుపేట పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద సంక్రాంతి సంబరాలలో భాగంగా సోమవారం తెల్లవారు జామున భోగి మంటలు వేశారు. భోగి మంటలు వేసి ఆటపాటలతో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సందడి చేశారు. కార్యకర్తలతో పాటు సినీ గీతాలకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ నృత్యం చేయడంతో సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదల వాడ అరవిందబాబు మాట్లాడతూ కూటమి ప్రభుత్వంలో ప్రజలందరూ సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకుంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నవ్యాంధ్ర విజన్ 2047కు అనుగుణంగా తీర్చిదిద్దుతారన్నారు. నరసరావుపేట ప్రజలందరూ సుఖ సంతోషాలతో సంక్రాంతి పండుగ జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ విభాగం నియోజవర్గ అధ్యక్షుడు మాబు, ఎం.బంగారం, అంకమ్మచౌదరి, కనుమూరి లక్ష్మి, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పాడైపోయిన వస్తువులను భోగి మంటల్లో వేశారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యువకులు కేరింతలు కొడుతూ సంక్రాంతి పర్వదినానికి స్వాగతం పలికారు.

కాకతీయ యూత్ ఆధ్వర్యంలో...

రొంపిచర్ల, జనవరి 13 (ఆంధ్రజోతి): మండల కేంద్రమైన రొంపిచర్ల పడమటిపాలెంలో సోమవారం కాకతీయ యూత్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. కప్పగంతులు, లెమన్ స్పూన్, పోటీలు జరిగాయి. 14వ తేదీన స్లో సైకిల్, ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, డ్యాన్స్ పోటీలు జరుగుతాయన్నారు. 15వ తేదీన తాడులాగు పోటీలు జరుగుతాయన్నారు. కనుమ సాయంత్రం బహుమతులు అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో వల్లభేశ్వర స్వామి, గణపవరంలో కళ్యాణంలో పాల్గొన్న భక్తులు

బరంపేటలో జనసేన ఆధ్వర్యంలో...

నసరావుపేట టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బరంపేటలో జనసేన ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి సంబరాల ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. విజేతకు ముఖ్యఅతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాదు, జనసేన జిల్లా కార్యదర్శి అద్దేపల్లి ఆనంద్‌బాబు, మండల అధ్యక్షుడు కృష్ణంశెట్టి గోవిందు, శ్రీనివాసరావు, వీర మహిళ విభాగం అధ్యక్షురాలు మిరియాల వెంకట సుబ్బమ్మ, ప్రధాన కార్యదర్శి గుప్త శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్, శ్రావణి, రేణుక, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రొంపిచర్ల, జనవరి 13 (ఆంధ్రజోతి): మండలంలోని గ్రామాల్లో భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు సోమవారం జరిగాయి. రొంపిచర్లలోని శంకరస్వామి, వాసవి, సంతగుడిపాడు, గోగులపాడు గ్రామాల్లో వెంకటేశ్వరస్వామి, చంద్రమౌళేశ్వర స్వామి, విప్పర్లలోని వల్లభేశ్వరస్వామి, వడ్లమూడివారిపాలెంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయాల్లో పూజా కార్యక్రమాలను మహిళలు, గృహాల ముందు భోగి కుండల ముగ్గులను వేశారు. స్వామి వార్లను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రొంపిచర్ల మండలంలో..

రొంపిచర్ల, జనవరి 13 (ఆంధ్రజోతి): మండలంలోని గ్రామాల్లో భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని భోగి మంటల కార్యక్రమాన్ని సోమవారం తెల్లవారుజామున నిర్వహించారు. ఈ సందర్భంగా

వినుకొండలో...

వినుకొండ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నియోజకవర్గంలోని పలు గ్రామాలతోపాటు వినుకొండ పట్టణంలో భోగి మంటలు ఏర్పాటుచేసి సంక్రాంతి పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారు జాము నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి చేరుకొని భోగిమంటలు వేసి హరిదాసులకు దానం సమర్పించారు. దీంతో ప్రధాన లోగిల్లు పుట్టింటికి వచ్చిన ఆడపడుచులతో పిల్లా పాపలతో కళకళలాడాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని జాలలపాలెంలో వంకాయపాటి బ్రదర్స్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను ఘనంగా సోమవారం నిర్వహించారు. మొత్తం పోటీల్లో 75మంది మహిళలు పాల్గొనగా మొదటి మూడు బహుమతులతోపాటు ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వంగవోలు ప్రకాష్ మాట్లాడుతూ ఐక్యమత్యంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప శుభపరిణామమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం పురుషులకు స్లోరైడింగ్, బండ్ల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతి డబుల్‌కాట్ మంచం, మూడో బహుమతి డ్రస్సింగ్ టేబుల్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొల్లి వెంకటేశ్వర్లు, సుబ్బారావు, బండారు మునెయ్య, గొట్టం గోవిందరాజులు, బత్తుల శ్రీనివాసరావు, కీర్తిపాటి వెంకటేశ్వర్లు, విజయరాజు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

● ఈపూరు: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం భోగి పండగను మండలంలోని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే ఇంటిముందు భోగి మంటలను వేశారు. అనంతరం తలంటు స్నానాలు చేసి నూతన వస్త్రాలను ధరించారు. పిల్లలకు భోగిపండ్లు పోశారు.

● నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో భోగి పండుగ, సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో తెల్లవారు జామునే గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో భోగి మంటలు వేశారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. గణపవరం గ్రామంలోని కోదండ రామస్వామి దేవాలయంలో గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వలేటి వెంకటేశ్వరరావు దంపతులు పాల్గొన్నారు. అదేవిధంగా సాతులూరు తదితర గ్రామాల్లో పూజలు నిర్వహించారు.

● మండలంలోని కనపర్రులో సంక్రాంతి సంబరాలను ఒకే వేదిక నిర్వహించారు. కులాలు, మతాలకు అతీతంగా ఒకే వేదికపై సంబరాలు జరుపుకోవటం ఐకమత్యాన్ని చాటిందని ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విజేతలకు ఎస్ఐ పుల్లారావు బహుమతులు అందజేశారు. యోగా గురువు గరికపాటి వెంకటేశ్వర్లు, కృష్ణవేణి విద్యా సంస్థల అధినేత నాతాని వెంకటేశ్వర్లు, కందిమళ్ళ వెంకటేశ్వర్లు, వీ సింగయ్య, జే రాము, ఎన్ రాఘవయ్య, నాగేశ్వరరావు, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి గుర్రం నాగ పూర్ణచంద్రరరావు, జే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● యడ్లపాడు: మండలంలో సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. దూర ప్రాంతాల నుంచి గ్రామాలకు తరలివచ్చిన వారితో వీధులు కళకళ లాడుతున్నాయి. మూడు రోజులపాటు ఎంతో సందడిగా చేసుకునే సంక్రాంతి సంబరాలు భోగి పండుగతో మొదలయ్యాయి. సోమవారం తెల్లవారుజామునే లేచి తలంటు స్నానాలు చేసి ఇళ్ళ ముందు భోగి మంటలు వేశారు. పిల్లలు, పెద్దలు సంప్రదాయ దుస్తులు ధరించి భోగి మంటల చుట్టూ చేరి సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు భోగి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హరిదాసు కీర్తనలు పాడుతూ భోగి వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నారులకు భోగి పళ్ల పోశారు.

● భోగి పండుగను పురస్కరించుకుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ అర్చకులు దేవతా మూర్తులకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. దేవతామూర్తులకు ప్రత్యేక అలంకరణ గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టతను భక్తులకు తెలియచేశారు. వంకాయలపాడులోని వేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. దంపతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణ వేడుకలను వీక్షించారు.

● నూజెండ్ల: మండలంలోని ప్రజలు సోమవారం భోగి పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి భోగి మంటలతో ప్రారంభమైన సంక్రాంతి సంబరాల్లో పిల్లలకు భోగి పండ్లు పోసి పెద్దలు ఆశీర్వదించారు. మండల కేంద్రం నూజెండ్లలో వాలీబాల్ పోటీలు, మారెళ్ళవారిపాలెం, కొత్తజెడ్డావారిపాలెం గ్రామాల్లో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో ఉత్సాహంగా క్రీడాకారులు పాల్గొని ఆటలు ఆడుతున్నారు.


వినుకొండలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న వంగవోలు ప్రకాష్, నరసరావుపేటలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాదు తదితరులు

ప్రత్తిపాటి సంక్రాంతి శుభాకాంక్షలు

చిలకలూరిపేట, జనవరి13 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంక్రాంతి ప్రజలకు ఆయురారోగ్యాలతో పాటు వారి జీవితాలలో కొత్త వెలుగులు, ఆనందంతో నింపాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు.


రంగనాథస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, తదితరులు

ఘనంగా గోదా, రంగనాథుల కల్యాణోత్సవం

వినుకొండ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్‌లోని శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి ఆశ్రమ ఆవరణలో శ్రీగోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం భక్తులు అంగరంగా వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణ వీధుల్లో పల్లకిసేవతోపాటు నగరోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం కల్యాణ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మనమడు అన్నప్రాసన సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవంలో అన్న సంతర్పణకు లక్ష ఆరువేల నూటపదహారు రూపాయలను నిర్వాహకులకు ఈ సందర్భంగా అందజేశారు. కార్యక్రమంలో జీవీ రమణతోపాటు సనిశెట్టి సీత, కొల్లిపర రాణి, పొత్తూరి లక్ష్మీకల్యాణి, ఉప్పలకుమారి, అచ్యుత లక్ష్మి, తాతా రమాదేవి, అరుణ, చండీప్రియ, మాలిని, ఉషారాణి, సనిశెట్టి వీరాంజనేయులు, ఉప్పల ప్రకాష్, అప్పలరాజు, అచ్యుత మోహన్ తీర్థప్రసాదాలు అందజేశారు.


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

నరసరావుపేటలో...

నరసరావుపేట అర్బన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం ముగింపు సందర్భంగా గోదాదేవి కల్యాణాన్ని మంగళవారం నిర్వహించారు. అర్చకులు చతుర్వేదుల భ్రమరకుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. కల్యాణోత్సవంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. కల్యాణ వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు జరిగాయి. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.


పంజాబ్ జట్టుతో సరదాగా కబడ్డీ ఆడుతున్న అరవిందబాబు

ఉల్లాసంగా కబడ్డీ పోటీలు

ఈపూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళలో సంక్రాంతి పండగ సందర్భంగా రైతుమిత్ర కబడ్డీ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు రెండోరోజు సోమవారం ఉల్లాసంగా జరిగాయి. పోటీలను నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వారితో కొద్దిసేపు సరదాగా కబడ్డీ ఆడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. గ్రామస్థులు ఐక్యమత్యంగా 33 సంవత్సరాలుగా జాతీయస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం హర్షనీయమన్నారు. ఝార్ఖండ్‌పై పంజాబ్, ఇనుమెళ్ళపై సత్తెనపల్లి, ముప్పాళ్లపై సత్తెనపల్లి జట్లు గెలుపొందాయి. కార్యక్రమంలో కొల్లా బ్రహ్మయ్య, కంచేటి చంద్రరావు, రాపర్ల రమేష్, తల్లపనేని రామారావు, సూరే కోటేశ్వరరావు, పాల్గొన్నారు.




చెక్కులను అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

నిరుపేద కుటుంబాలకు ఆదాయ కల్పనకు రూ.1.84 కోట్లు

చిలకలూరిపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాలలో భూమి లేని నిరుపేద కుటుంబాలకు ఆదాయ కల్పన కోసం నిర్దేశించిన (పనికిరాని భూముల అభివృద్ధి) కార్యకలాపాల కోసం స్థానిక సేవా సంస్థ అసిస్ట్ ఒక ప్రత్యేక పథకాన్ని రూపొందించింది. ఇందుకోసం గుర్తించిన కుటుంబాలకు భారీ మొత్తాన్ని సాయంగా అందిస్తున్నారు. సంస్థ ఆపరేషనల్ డైరెక్టర్ డాక్టర్ జాష్టి రంగారావు సేవా ప్రస్థాన స్వర్ణోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమంలో ఆదివారం రాత్రి ఇందుకు సంబంధించిన రూ.1.84 కోట్లు విలువగల రెండు చెక్కులను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వడ్లమాని రవి, అసోసియేట్ డైరెక్టర్లు కృష్ణ హరీష్, విష్ణుప్రియ పాల్గొన్నారు.

శావల్యాపురంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

శావల్యాపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని సంక్రాంతి వేడుకలలో భాగంగా మండల కేంద్రమైన శావల్యాపురంలోని కాకతీయ యూత్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ పాఠశాలలోని క్రీడామైదానంలో గ్రామస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. శావల్యాపురం సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాద్, ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు ముఖ్యఅతిథులుగా పాల్గొని రిబ్బన్ కత్తిరించి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. అనంతరం క్రికెట్ పోటీలకు హాజరైన క్రీడాకారులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకతీయ యూత్ సభ్యులు చెరుకూరి బాలకృష్ణ మాట్లాడుతూ టోర్నమెంట్‌లో మొత్తం 16టీంలు పాల్గొనబోతున్నాయని, ఐదు రోజులపాటు క్రికెట్ పోటీలు జరుగుతాయన్నారు. టోర్నమెంట్ విజేతలకు ప్రథమ బహుమతి రూ.10,116లను గడిపూడి నర్సయ్య, బాపమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు, ద్వితీయ బహుమతి రూ.7,116లను కాకతీయ యూత్ సభ్యులు, తృతీయ బహుమతి రూ.5,116లను కొమ్మారెడ్డి సతీష్ జ్ఞాపకార్థం తండ్రి వెంకటసుబ్బారావు అందజేయనున్నట్లు తెలిపారు. ఎస్ఐ లోకేశ్వరరావు, సొసైటీ సీఈవో నాగప్రసాద్ మాట్లాడుతూ పండగ వాతావరణంలో క్రీడాకారులలో ఉత్సాహాన్ని, ఆనందాన్ని నింపేందుకు క్రికెట్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాకతీయ యూత్ సభ్యులు చెరుకూరి అనిల్, కాకాని లోకేష్, బోనముక్కల రాజశేఖర్, కుక్కపల్లి వెంకటేష్, దూదేకుల మస్తాన్, చింతా లోకేష్ పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకొంటున్న ఎస్ఐ లోకేశ్వరరావు

